# నేనైతేనా?

"నువ్వెందుకివన్నీ భరిస్తావు? హాయిగా వెళ్ళిపో, అప్పటికి కాని తెలిసి రాదీ మొగవాళ్ళకి" సానుభూతి నిండిన కంఠంతో పార్వతిని ఓదారుస్తుంది సీత. "నేనైతే అంతే చేస్తాను పార్వతీ. పిల్లనీ జెల్లనీ ఎత్తుకుని ఓ పెట్టె సర్దుకుని అమ్మగారి యింటికి హాయిగా వెళ్ళిపోతాను. ఎందుకు వెళ్ళిపోతున్నానో చెప్పి మరీ వెళ్ళిపోతాను" ఇస్త్రీ చేసిన నాని గాడి చొక్కా అందుకుని పక్కన పెట్టింది. "అలా చేస్తే గాని యీ కృష్ణమూర్తికి నీ విలువ తెలిసిరాదు. నీకూ నీ విలువ తెలిసిరాదు. ఏం? ఎందుకు పడాలి. పెళ్ళాం అయినంత మాత్రాన ఎంత పడితే అంత అనేయడమేనా? ఎలా పడితే అలా ట్రీట్ చెయ్యడమేనా?" ఊరికే ఆవేశం తెచ్చుకొని కోపం ప్రకటిస్తుంది సీత.

"పెళ్ళికాని సీతకి ఎంత చెప్పితే అర్థం అవుతుంది-అలా వెళ్ళిపోవడం కుదరదని" నిట్టూర్చింది పార్వతి

పాపాయి గౌనుకి వున్న మెడచుట్టూ లేసు నైలానుది కాబోలు, కర్మ ఇస్త్రీ పెట్టె తగలగానే ముద్దయిపోయింది. విసుక్కుంటూ గౌనుతీసి పక్కన పెట్టింది పార్వతి. పక్కనే వున్న బల్లమీద కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తుంది సీత.

"నీ కింత ఓర్పెలా వచ్చిందే పార్వతీ. నాకే ఆశ్చర్యంగా వుంది" గొప్ప డిస్కవరీ చేసినట్టు అడిగింది.

"తెగతెంపులు చేసుకుపోవడం నీ వనుకుంటున్నంత సులభం కాదు సీతా" నెమ్మదిగా అంది పార్వతి.

"ఎందుక్కాదు? కారులో పెట్రోలుంది. బేంకులో డబ్బుంది. కాళీ పెట్టు లున్నాయి...మీ కైౖ మీరు కించపడతారు. అందుకే మీకు కుదరదు. నే నైతేనా?" తీవ్రంగా అంది సీత.

"నేనూ అలాగే అనుకునేదాన్ని సీతా. మా అత్తయ్యలాగా మా అమ్మలాగా ఎప్పుడూ పడి వుండకూడ దనుకునేదాన్ని. ఓ సారేమైందో తెలుసా" కుతూహలంగా అడిగి ఆగింది పార్వతి.

"ఏమైంది? కృష్ణమూర్తి చెయ్యి చేసుకున్నాడా?"
నవ్వేసింది పార్వతి.

"నేనూ నానిగాడి పురిటికోసం ఆస్పత్రికి వెళ్ళాను. నన్ను చూడటానికివచ్చినప్పుడల్లా—ఎప్పుడొస్తావు ఎప్పుడొస్తావని అడిగేవాడు మూర్తి. "ఏం నే లేకుంటే అంత బెంగగా ఉందా?" అని ఎంతో ప్రేమతో అడిగాను. ఔనంటాడని కొండంత ఆశ పడ్డాను..."

"ఏమన్నా డేమిటి?" ఆత్రంగా ముందుకు వంగుతూ అడిగింది సీత.

"అబ్బే యిల్లంతా చిందరవందరగాఉంది. నువ్వెళ్ళాక నూకాలు నా పక్క మీది దుప్పటికూడా మార్చ లేదు అన్నాడు కృష్ణమూర్తి" అంది పార్వతి.

"బ్రూట్ ఏం మనిషి? పురుడు అంటే పునర్జన్మకదా ఆడదానికి. సానుభూతిలేదు సరికదా పనికి మనిషి తక్కువైందా..." ఓక్షణం ఆగి "చూడ్డానికి కృష్ణమూర్తి అలా కనిపించడు కదూ" అంది నెమ్మదిగా.

"నాకూ అలాగే అనిపించింది. ఓ సారి మాటా మాటా వచ్చి "ఓక్షణం నీతో యీ యింట్లో ఉండను. నేడు వెళ్ళి పోతాను" అనేశాను. అనేసి ఊరుకోలేదు సీతా, ఖాళీ పెట్టె తీసి బట్టలు సర్దేయాలనుకున్నాను కాని ఏం సర్దాలి? పిల్లడి బట్టలకే ఒక పెట్టె చాలదు. ఇంకా నా బట్టలసంగతి?...ఓడి పోయి ఊరుకున్నాను. ఇంకోసారి అలాగే జరిగింది. బట్టలన్నీ మాసివున్నాయి. ఓ రోజంతా ఉతికి ఆరేసి ఇస్త్రీ పెట్టాను. కోపం దిగజారిపోయింది."

"అంతే. నీ మెత్తదనంచూసే అలా ఆడిస్తున్నాడు"

"మొన్నీమధ్య పాపాయి పుట్టాక వెళ్ళిపోదామనే అనుకున్నాను. కాని నానిగాడు రానన్నాడు" నెమ్మదిగా అంది పార్వతి.

"వాట్ ! నువ్వు అమ్మమ్మ యింటికి పిలిస్తే నానిగాడు రానన్నాడా?" ఆశ్చర్యంగా అడిగింది సీత.

"వాడికి కృష్ణమూర్తి దేవుడు. ఏం చేస్తాను చెప్పు ? ఎలా కుదురుతుంది?" సూటిగా అడిగింది పార్వతి.

"నిజమే ననుకో. అయినా దీనికో అర్థం వుండాలి—ఈ ఫిజికల్ స్లావరీకి. ఏమంటావు?" అంది సీత.

"అండాని కేంవుంది సీతా. ఇది బానిసత్వం అని పెళ్లాలు అనుకోడంలేదు. బానిసలా చూస్తున్నాం అని మొగుళ్ళు అనుకోవడం లేదు. వాళ్ళే అనుకోనంత కాలం

"నువ్వెంత హెచ్చరించినా ప్రయోజనం ఉండదు" నెమ్మదిగా చెప్పింది సీత.

"అంతేనంటావా?" ఇంకా నెమ్మదిగా వినీ వినిపించనంత నెమ్మదిగా అడిగింది సీత.

"అంతేకాదు. నేను యిందుకొచ్చేశానురా అంటే అన్నయ్యకూడా రానిచ్చాడు" ఇస్త్రీ పెట్టె పక్కకితీస్తూ అంది పార్వతి.

హాల్లో ఫోను మ్రోగింది.

సీత పరుగెత్తింది.

"పారూ నీ కోసం మీావారు" అని కేకేసింది.

ఒక్క పరుగున ఫోనుదగ్గరికి పరుగెత్తింది పార్వతి.

ఫోనులో ఏం మాట్లాడిందీ తెలియలేదుగాని పార్వతి ముఖం రాగరంజితం అయింది. కళ్ళు చిరుచేపల్లాగా మెరుస్తున్నాయి అందంగా వంగిన పెదవులు అదురుతున్నాయి.

సీత వింతగా చూస్తూ కూర్చుంది.

"అలాగే" అంటూ ఫోన్ పెట్టేసి సీతకేసి చూసి పార్వతి సిగ్గుపడి పోయింది.

"ఏమంటాడేం మీా కృష్ణమూర్తి" కొంటెగా అడిగింది సీత.

"ఏంలేదు. నూకాలుఉంటే రాత్రికి ఉండమను. సినిమాకు వెడదాం అన్నాడు" నవ్వేసింది పార్వతి.

"అంతేనా? సినిమాకి తీసుకువెడితే పొద్దుట చేసిన హంగామా మరచిపోడమేనా?"

"హంగమా ఏమిటే నీ ముఖం. ఉదయాన్నే ఆఫీసుకు వెళ్ళవలసిన పెద్ద మనిషికి ఉతికిన చొక్కా-ఏనా యివ్వకపోతే ప్రాణం విసగదా యేం?" అడిగింది పార్వతి. "ఇంకానయం. కృష్ణమూర్తి కనుక కసురుకున్నాడు. నీకొచ్చే మొగుడైతే నాలుగంటిస్తాడు జాగ్రత్త" అంటూ నూకాలుకోసం లోపలికి నడిచింది పార్వతి. "ఇంతేనా?" అని అలాగే కూర్చుండి పోయింది సీత. ఎంతో ఉత్సాహంగా కూనిరాగాలు తీస్తూ పనిపాటలు ముగిస్తున్న పార్వతి పౌరుషంచచ్చిన ఆడదా! లేక మొగాడు మెచ్చే దేవతా- తేల్చుకోలేని విషమస్థితిలో పడి పోయిన సీతకి - ఊహాలోకానికీ, నిజజీవితానికి పోలికలు కన్పించడంలేదు సరికదా, ఏది నిజం? ఏది అబద్ధం అన్న మీమాంస పట్టుకుంది,

"ఊపిరి తీస్తున్నావా లేదా ఆంటీ?" అంటూ నాని గాడు ముఖంముందు వ్రేళ్ళు ఆడిస్తుంటేగాని తిరిగి - యీ మాయజగత్తులో పడలేకపోయింది పాపం కన్నెపిల్ల సీత!